# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 04 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## స్టాక్ మార్కెట్లు ఢమాల్

**బలగం టీవీ, ముంబై**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు దేశీయ మార్కెట్లపై ప్రభావం పడింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయడంతో యుద్ధ వాతావరణ నెలకొన్నది. ఈ క్రమంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లు నష్టాల్లో ఊబిలోకి జారుకున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ రెండుశాతానికిపైగా పడిపోగా.. దాదాపు రూ.11లక్షలకోట్లకుపైగా మదుపరుల సంపద ఆవిరైంది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ముడి చమురు ధరలు పెరిగాయి. ఇక బీఎస్ఈలో లిస్ట్ అయిన అన్ని కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.63లక్షల కోట్లు తగ్గి రూ.469 కోట్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,002.09 మొదలైంది. మొదట్లోనే 1,250 పాయింట్లకుపైగా నష్టాల్లో ట్రేడింగ్ మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేదు. ఇంట్రాడేలో 82,434.02 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది.చివరకు 1,769.19 పాయింట్ల నష్టంతో 82,497.10 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 546.80 పాయింట్లు పతనమై.. 25,250.10 వద్ద ముగిసింది. ఇటీవల వరుస లాభాలతో స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులను సృష్టిస్తూ వచ్చాయి. దాదాపు రెండు నెలల అనంతరం పతనమ్యాయి.

మిగితా 5వ పేజీలో

# అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకే
# ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే



- **ఒకే కార్డు ద్వారా పలు సేవలు**
- **ప్రతిపక్షాలు సూచనలు, సలహాలు ఇవ్వాలి**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **కంటోన్మెంట్‌లోని సిఖ్ విలేజ్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల కార్యక్రమం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా, మరింత సమర్థవంతంగా అమలు చేయడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు (జారీ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వన్ స్టేట్ - వన్ కార్డు ఆలోచనతో చేపట్టిన ఈ బహుళ ప్రయోజన కార్డుల జారీ ప్రక్రియను ప్రజలంతా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనకు సంబంధించిన సర్వే పత్రాలను సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సిఖ్ విలేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగ లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాధాన్యతను ముఖ్యమంత్రి వివరించారు.

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. అలా కాకుండా అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందజేస్తారు. ఇందుకోసం 3 నుంచి 7 వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని.. ప్రతిపక్షాలు దీనిపై ఎవైనా సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలన్నారు.

రేషన్ కార్డు కోసం పదేళ్ల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగారన్న సీఎం మెరుగైన విధానంతో పరిపాలన సాగించేలా ఒకే రాష్ట్రం ఒకే కార్డు పేరిట పైలెట్ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే ఈ విధానం రుపొందించామన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో పథకాల సమాచారంతో పాటు ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరుస్తామని సీఎం తెలిపారు.

మిగితా 5వ పేజీలో

### మూసీని అడ్డం పెట్టుకుని ఎంతకాలం బతుకుతారు

హైడ్రాపై అసెంబ్లీలో చర్చించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆనాడు హైడ్రాపై సూచనలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రాంత పేదలకు 15 వేల ఇళ్ల కేటాయింపునకు ఆదేశాలు ఇచ్చామన్నారు. డబుల్? బెడ్? రూమ్? ఇళ్ల కంటే ప్రత్యామ్నాయం ఏముందని ప్రసంగించారు. అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేస్తాం, వచ్చి సలహాలు ఇవ్వండని ప్రతిపక్షాలకు సూచించారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబిత కుమారుల ఫామ్‌హౌస్‌లు కూల్చాలా వద్దా చెప్పండని అడిగారు. ఫామ్‌హౌస్‌లు కూల్చుతారనే పేదలను అడ్డుపెట్టుకుని ధర్నాలు, దీక్షలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని అడ్డం పెట్టుకుని ఎంతకాలం బతుకుతారు, హైదరాబాద్‌లో మీ భరతం పడతామని హెచ్చరించారు. కిరాయి మనుషులతో కేటీఆర్, హరీశ్‌రావు హడావుడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికి మునిగిపోతున్న నగరాన్ని కాపాడుకుందామని సూచించారు. కేటీఆర్, హరీశ్‌రావు సచివాలయానికి రండి నాలుగు రోజులు చర్చిద్దామన్నారు. ఈ ప్రభుత్వం పేదల కన్నీళ్లు చూడదలచుకోలేదని అన్నారు.


### 'కిషన్‌రెడ్డి, ఈటలకు మోడీ చేపట్టిన సబర్మతి రివర్ ఫ్రంట్ కావాలి కానీ మూసీ రివర్ ఫ్రంట్ వద్దా..'



కిషన్‌రెడ్డి, ఈటల మీకు ప్రధాని మోడీ చేపట్టిన సబర్మతి రివర్ ఫ్రంట్ కావాలి కానీ మూసీ రివర్ ఫ్రంట్ వద్దా అంటూ సీఎం రేవంత్ ప్రశ్నించారు. మూసీ నిర్వాసితులకు ఎలా ఆదుకోవాలో సూచనలు ఇవ్వండని అడిగారు. ఈటల రాజేందర్ మీ నేతృత్వంలోనే నిధుల కోసం మోదీ వద్దకు వెళ్దామన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను తీసుకుని రండి రూ.25 వేల కోట్లు ఇప్పించండని సీఎం కోరారు. హైదరాబాద్ నగరంలో చెరువులు ఆక్రమించిందెవరో తేల్చుదామని సవాల్ విసిరారు. మూసీ వల్ల నల్గొండ ప్రజలు విషాన్ని మింగుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు

# రైల్వే ఉద్యోగులకు బోనస్

### 5 భాషలకు ప్రాచీన హెూదా.. కేంద్ర కేబినెట్ నిర్ణయాలివే



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశంలోని 11,72,240 మంది రైల్వే ఉద్యోగుల కోసం మొత్తం రూ. 2,028.57 కోట్లతో ఉత్పాదకత లింక్డ్ బోనస్ చెల్లింపునకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. సిబ్బంది అద్భుతమైన పనితీరును గుర్తించి వారిని ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోడీ అధ్యక్షతన గురువారం న్యూఢిల్లీలో కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా తీసుకున్న కీలక నిర్ణయాలకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్'కు ఆమోదం తెలిపిందన్నారు. రూ.10,103 కోట్లతో నూనె గింజల ఉత్పత్తి చేయాలని నిర్ణయించిందని చెప్పారు. ఇక వంట నూనెల విషయంలో విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. నేషనల్ మిషన్ ఏడేళ్ల పాటు అమలు కానుందని చెప్పారు. తమిళనాడు రాజధాని చెన్నైలో 118.9 కి.మీ మేర 128 స్టేషన్లతో నిర్మించనున్న చెన్నై మెట్రో ఫేజ్-2కు కేంద్ర మంత్రి వర్గం పచ్చ జెండా ఊపిందని చెప్పారు. ఈ మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 63,246 కోట్లుగా కేంద నిర్ణయించిందని వివరించారు.

ఫేజ్-2లో భాగంగా ఉత్తరం నుంచి దక్షిణానికి, తూర్పు నుంచి పడమరకు మొత్తం 3 మెట్రో కారిడార్లు నిర్మించాలని.. అవి మాధవరం నుంచి సిప్కాట్ వరకు, లైట్ హౌస్ నుంచి పూనమల్లీ బైపాస్ వరకు, మాధవరం నుంచి శోలింగనూర్ వరకు ఈ కారిడార్లను విస్తరిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

అంతేగాక, దేశంలో మరాఠీ సహా ఐదు భాషలకు ప్రాచీన హెూదా కల్పించేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో మరాఠీ, పాళి, ప్రాకృతం, అస్సామీ, బెంగాళీ భాషలకు ప్రాచీన హెూదా దక్కనుంది. ఇప్పటికే తెలుగు సహా ఆరు భాషలకు ప్రాచీన హెూదా ఉన్న విషయం తెలిసిందే.

వ్యవసాయ సంబంధిత పథకాలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చేలా రెండు ప్రత్యేక స్కీంలను కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన పథకాల ద్వారా సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రతకు సంబంధించి రూ. లక్ష కోట్ల వ్యయంతో ఈ రెండు స్కీంలను అమలు చేయనుంది.

## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



**బలగం టీవీ, తిరుమల**

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా గురువారం అంకురార్పణ జరిగింది. శ్రీవారి సేనాధిపతి అయిన విశ్వక్సేనుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తర్వాత మాడవీధుల్లో విశ్వక్సేనులు వారు విహరించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల 40 నిమిషాలకు బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మీనలగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు.

తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం టీటీడీ ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతాయని.. వెల్లడించారు. ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

'ఈ బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడ వాహనసేవ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ విశేష ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసే భక్తకోటికి టీటీడీ అనేక ఏర్పాట్లను చేసింది. అక్టోబర్ 4న ముఖ్యమంత్రి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అక్టోబర్ 5వ తేదీ తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున రూ.13.45 కోట్లతో నూతనంగా అత్యాధునిక పరికరాలతో నిర్మించిన వకుళమాత కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారు' అని టీటీడీ ఈవో చెప్పారు.

'భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు రద్దయ్యాయి. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. రోజుకు 7 లక్షల లడ్డూలను నిల్వ ఉంచాం. లడ్డూ కౌంటర్లు 2023లో 54 ఉండగా.. 2024లో 65 ఏర్పాటు చేశాం. వయోవృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక దర్శనాలు రద్దు చేశాం. బ్రేక్ దర్శనం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం అవుతుంది. గరుడసేవ రోజు అక్టోబరు 8న బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దు చేశాం' అని ఈవో శ్యామలరావు వెల్లడించారు.

'శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు 1.32 లక్షల రూ.300 దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. తిరుపతిలో ప్రతిరోజూ సర్వదర్శనం టోకెన్లు 24 వేలు అందుబాటులో ఉన్నాయి. అంగప్రదక్షిణ టోకెన్లను రద్దు చేశాం. శ్రీవారి ఆలయం, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో ఉద్యానవన, విద్యుత్ విభాగాల ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరణలు చేపడుతున్నాం' అని ఈవో వివరించారు.

మిగితా 5వ పేజీలో

## రైతులకు గుడ్ న్యూస్... ఈ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్

**బలగం టీవీ, హైదరాబాద్**

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సీజన్ నుంచే సన్న వడ్లకు కనీస మద్దతు ధరకు అదనంగా ఒక్కో క్వింటాలకు రూ.500 బోనస్ చెల్లిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ప్రతి కేంద్రానికి క్రమసంఖ్య ఇవ్వాలని, సన్నవడ్ల కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు చెప్పారు. గోనె సంచులు అందుబాటులో పెట్టాలని తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే తరలించాలని చెప్పారు. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ఐకేపీ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

గత సీజన్ లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చామని, ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పినట్లు సీఎం ప్రకటించారు.

ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా.. ఎక్కడైనా కొనుగోలు కేంద్రం అవసరమని కలెక్టర్లు భావిస్తే అక్కడ కొత్త కేంద్రం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని సీఎం చెప్పారు.సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి తప్పుడు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని అన్నారు. సన్నవడ్ల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, లేదా కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

సన్న వడ్లు కొనేటప్పుడు నిర్దేశించిన ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అధికారులను అప్రమత్తం చేశారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. సన్న వడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్‌మాల్ జరిగే ప్రమాదముందని ముఖ్యమంత్రి హెచ్చరించారు.ప్రతి కేంద్రానికి ఒక నెంబర్ కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నెంబర్ తప్పకుండా వేయాలని సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్ మాల్ జరిగినా ఎక్కడ జరిగిందో సులభంగా తెలుసుకునే వీలుంటుందని చెప్పారు.

మిగితా 5వ పేజీలో

## చెంచులు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

- **ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలి**
- **మంత్రి దామోదర్ రాజనర్సింహా**
- **అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష**




**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఐటీడీఏ పరిధిలో నివసించే చెంచులు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధి లో నివసించే చెంచులకు, గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య భవన్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని ఉట్నూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, మున్ననూరు లతో పాటు ఇతర జిల్లాలలో ఉన్న గిరిజనులకు, చెంచులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన విషయమై మంత్రి దామోదర్ రాజ నర్సింహా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో చెంచులు, గిరిజనులకు వైద్య వసతుల కల్పనపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖల అధికారులకు మంత్రి రాజ నర్సింహా దిశానిర్దేశం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి చెంచు పెంట, గిరిజన గూడెంలో నివసించే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భౌగోళికంగా ఐటీడీఏ పరిధిలో అత్యవసర పరిస్థితుల్లో అరగంట లోపే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులకు చేరుకునేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు.గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు భౌగోళికంగా నెట్వర్క్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన చోటా కొత్తగా ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని ఆసుపత్రులలో సిబ్బంది, డాక్టర్లు మందులు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు.

ఐటీడీఏ ప్రాంతాలలో సీజనల్ వ్యాధుల నివారణ పై మంత్రి దామోదర్ రాజనర్సింహ చర్చించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి గిరిజన వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల సీజన్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమీక్ష లో గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి శరత్, హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఫ్యామిలీ హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవ్ రావు తదితరులు ఉన్నారు.

## భట్టి విక్రమార్క విదేశీ టూర్ విజయవంతం

**బలగం టీవీ, హైదరాబాద్**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విదేశీ పర్యటన విజయవంతమైంది. ఈ మేరకు ఆయన శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పర్యటన ఫలప్రదమైంది. పెద్ద ఎత్తున పరిశ్రమాలతో ఒప్పందాలు, స్థాపనకు అంగీకారాలతో ఆయన స్వదేశానికి రానున్నారు. గత నెల 24న ప్రారంభమైన డిప్యూటీ సీఎం భట్టి అమెరికా, జపాన్ దేశాల అధికారిక పర్యటన గురువారంతో విజయవంతంగా ముగిసింది.మొత్తం మీద రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆయనతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం జరిపిన పర్యటన రాష్ట్ర విద్యుత్ రంగంలో అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు, సింగరేణిలో రక్షణతో కూడిన అధికోత్పత్తి మైనింగ్ పద్ధతుల ఆచరణకు ఊతం ఇవ్వనుంది. శుక్రవారం రాత్రి 9 గంటలకు డిప్యూటీ సీఎం అధికారుల బృందం హైదరాబాద్‌కు చేరుకోనుంది.ఈ పర్యటనలో ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పి.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్న విషయం తెలిసిందే. రెండు దేశాల ఈ పర్యటనలో ప్రధానంగా అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చిన అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలు, ఆధునిక మైనింగ్ విధానంలో అధికోత్పత్తిని సాధించే భారీ యంత్రాలు, వర్చువల్ రియాలిటీతో రక్షణ చర్యలు మొదలైనవి స్వయంగా పరిశీలించడమే కాక వీటిని రాష్ట్రంలో అమలు జరపడానికి శ్రీకారం చుట్టారు.

### కేసీఆర్‌ను కేటీఆర్ ఏదో చేశారు

- **పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తాం**
- **మంత్రి కొండా సురేఖ**

**బలగం టీవీ, హైదరాబాద్**

పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆర్ ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోందని మంత్రి కొండా సురేఖ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గజ్వేల్ లో నేడు ఆమె మీడియాతో మాట్లాడుతూ, ..'సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని నాపై కేటీఆర్ పిచ్చి రాతలు రాయిస్తున్నారు. తొమ్మిది హామీలు అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆర్ ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ సమావేశాల రోజు కేసీఆర్ కనిపించారు. అప్పటి నుంచి మళ్లీ కేసీఆర్ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఏం చేస్తున్నారో

మిగితా 5వ పేజీలో

### హుజుర్‌నగర్ ఐటీఐకి రూ.14.35కోట్లు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హుజుర్ నగర్ నియోజకవర్గంలో పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐ.టి.ఐ) ని మంజూరు చేయించడంతో పాటు శాశ్వత భవన నిర్మాణానికి గాను స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర నీటిపారుదల పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి 14.35 కోట్లు నిధులను విడుదల చేయించారు. ఎలక్ట్రీషియన్,ఫిట్టర్,డ్రాఫట్స్ మెన్,డీజిల్ మెకానిక్ లతో పాటు వెల్డర్ కోర్సులలో శిక్షణ నిమిత్తం ప్రారంభిస్తున్న ఈ నూతన ఐటిఐ తో ఈ ప్రాంత నిరుద్యోగులకు ప్రయోజనకారిగా మారనుంది.

మొత్తం ఐదు కోర్సులలో 216 విద్యార్థులతో ప్రారంభం కానున్న ఈ ఐ టి ఐ కి ప్రిన్సిపాల్ తో సహా 8 పోస్టులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఒప్పించి మంజూరు చేయించారు. గతంలో తాను మంజూరు చేయించిన అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ సమీపంలో రామస్వామి గుట్ట వద్ద కొత్తగా మంజూరు అయిన పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐ. టి.ఐ)నీ నెలకొల్పనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో అనేక ప్రయోజనాలు



- రైతుబంధు, ఆరోగ్యశ్రీ, బీమాలకు ఈ కార్డు ఉపయోగపడుతుంది
- బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్
- కరీంనగర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమం ప్రారంభం

**బలగం టీవీ, కరీంనగర్**

ఫ్యామిలీ డిజిటల్ కార్డులతో అనేక ప్రయోజనాలు ఉంటాయని బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతుబంధు, ఆరోగ్యశ్రీ, బీమాలకు ఈ కార్డు ఉపయోగపడుతుందని వెల్లడించారు. కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు కూడా కార్డులో పొందుపరుస్తామన్నారు.

కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సర్వేను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ఎన్నో సమస్యలకు పరిష్కారంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపొందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సర్వే ప్రతి నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా గురువారం ప్రారంభమైందన్నారు.

సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలా లక్షరూపాయలను నాలుగు సార్లు ఇవ్వడం లేదని ఒకే సారి మాఫీ చేశామన్నారు. రేషన్ కార్డు లేక రుణమాఫీ ఆగిన వాళ్లకు అతి త్వరలోనే వస్తుందని హామీ ఇచ్చారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కార్యక్రమంలో భాగంగా ఇంటి మహిళను గృహ యజమానిగా గుర్తించనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతుబంధు, ఆరోగ్యశ్రీ, బీమాలకు ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. కుటుంబానికి గుర్తింపు ఉండేవిధంగా కార్డును తయారు చేస్తామన్నారు. డిజిటల్ కార్డుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు కూడా కార్డులో పొందుపరుస్తామని వివరించారు.

ఎవరైనా ఉపాధి కోసం వెళితే తాత్కాలికంగా అక్కడి నెంబరు తొలగిపోయి వలసవచ్చిన గ్రామంలో యాడ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అక్కడే రేషన్‌తో పాటు పెన్షన్ కూడా తీసుకోవచ్చుని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లోటుపాట్లు ఏమైనా ఉంటే అధికారులకు ధైర్యంగా చెప్పవచ్చుశ్రీవప్త్రశ్రీఎఱ. తద్వారా మిగిలిన ప్రాంతాల్లో అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. కార్డులో లేని వివరాలు తెలుసుకుని నమోదు చేయించే కార్యక్రమం ఇది అని తెలిపారు. కొత్తగా వివాహం అయిన వారివి, మరణించిన వారి వివరాలు అప్‌డేట్ చేయనున్నట్లుగా వివరించారు. వన్ స్టేట్ వన్ కార్డు కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని లాంచ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్డుల విషయంలో పొరుగు రాష్ట్రాల్లో ఎలా అమలు చేస్తున్నారో అధికారులు పరిశీలించి వచ్చారని పొన్నం పేర్కొన్నారు. ఇందులో వ్యక్తుల ఆస్తుల లావాదేవీలు ఏమి ఉండవని కేవలం కుటుంబ సభ్యుల వివరాలు, ఫోటో ఆరోగ్య వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇవి పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నాం కాబట్టి ఇందులో ఏమైనా లోటుపాట్లు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

చేప పిల్లలను వదిలిన మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ జిల్లా కేంద్రం లో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అధ్యక్షతన లోయర్ మానేరు డ్యాం లో 100 శాతం సబ్సిడీ తో చేప పిల్లల విడుదల కార్యక్రమంకి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ సునీల్ రావు, ఫిషరీస్ కమిషనర్ ప్రియాంక ఆలా,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మత్య పారిశ్రామిక సంఘం జిల్లా చైర్మన్ పిట్టల రవీందర్,కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటు నేత వెలిచాల రాజేందర్ రావు తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. లోయర్ మానేరు డ్యాం లో గంగమ్మ తల్లికి పూజలు చేసి చేప పిల్లలు విడుదల చేయడం జరిగింది



# షాపింగ్ మాల్ ఓపెనింగ్ లో అపశృతి..



- కుప్పకూలిన స్టేజీ
- ఎమ్మెల్యే యశస్విని అత్తకు గాయాలు
- సురక్షితంగా బయటపడ్డ హీరోయిన్ ప్రియాంక మోహన్

**బలగం టీవి, మహబూబాబాద్**


మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. ఈ షాపింగ్ మాల్ ఓపెనింగ్ సందర్భంగా అక్కడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టేజ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిలో ఎమ్మెల్యే యశస్విని అత్త ఝాన్సి రెడ్డి కూడా ఉన్నారు.

వివరాల్లోకి వెళ్తే.. తొర్రూరులో కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం జరిగింది. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హీరోయిన్ ప్రియాంక మోహన్, ఎమ్మెల్యే యశస్విని అత్త, పాలకుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ ముందు ఏర్పాటు చేసిన వేదిక పై ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తుండగా వేదిక ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే యశస్విని అత్త ఝాన్సీ రెడ్డి గాయపడ్డారు. ఆమె కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం ఆమెను హైదరాబాద్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా ఈ ప్రమాదం నుంచి సినీనటి ప్రియాంక మోహన్ సురక్షితంగా బయటపడ్డారు.

## కొండా సురేఖపై వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయించిన నాగార్జున

**బలగం టీవి,హైదరాబాద్**

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో నాగార్జున పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో నాగార్జున కోరారు. శుక్రవారం నాగార్జున పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది.



# అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించా..



- మంత్రి కొండా సురేఖ

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురైనట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆయనపై విమర్శలు చేసే క్రమంలో అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. హనుమకొండలో ఆమె మీడియాతో మాట్లాడారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురైనట్లు మంత్రి తెలిపారు. ఆయనపై విమర్శలు చేసే క్రమంలో అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించానన్నారు. తనకు ఎవరిమీద వ్యక్తిగత ద్వేషం, కోపం లేదన్నారు. ఆ కుటుంబ సభ్యులు పెట్టిన పోస్టు చూసి చాలా బాధపడ్డానని.. ఏ విషయంలో తాను బాధపడ్డానో.. ఆ విషయంలో మరొకరిని నొప్పించానని తెలిసి వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను పడిన బాధ వేరేవాళ్లు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నానని కొండా సురేఖ పేర్కొన్నారు. అప్పుడే దీనిపై స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశానని.. కేటీఆర్ విషయంలో మాత్రం తగ్గేదేలేదని.. ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. కేటీఆర్ లీగల్ నోటీసుపై న్యాయపరంగా ముందుకెళ్తామని కొండా సురేఖ పేర్కొన్నారు.

అంతకుముందు నటి సమంతపై తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నానని మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా తెలిపారు. “నా కామెంట్స్ ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరని ప్రశ్నించడమే కానీ మీ మనోభావాలు దెబ్బతీయడం కాదు. స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు ఆదర్శం. నా వ్యాఖ్యల పట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్థాపానికి గురైనట్లయితే బేషరతుగా నా వ్యాఖ్యలను వెనక్కి పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను” అని మంత్రి పేర్కొన్నారు.

కాగా నాగచైతన్య-సమంత కేటీఆర్ వల్లే విడాకులు తీసుకున్నారంటూ కొండా సురేఖ బుధవారం ఆరోపించారు. ఆమె కామెంట్స్ పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమె వ్యాఖ్యలపై అక్కినేని కుటుంబం ఆగ్రహం వ్యక్తంచేసింది. మంత్రి కొండా సురేఖకు లీగల్ నోటీసులు పంపేందుకు అక్కినేని నాగార్జున సిద్ధమవుతున్నారు.




- మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్**

మంత్రి కొండా సురేఖ సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల గురించి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. అవి తాను అనుకోకుండా చేసిన వ్యాఖ్యలని, వాటిని ఉపసంహరించుకున్నట్లు సురేఖ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీనిపై మీడియాతో చెప్పడంతో పాటు ఎక్స్ వేదికగా కూడా మంత్రి పోస్టు పెట్టారని తెలిపారు. అందుకే సినీ ప్రముఖులు ఈ అంశానికి ముగింపు పలకాలని కోరారు. మహిళల పట్ల కేటీఆర్ చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడం తప్పితే.. ఎవరి మనోభావాల్నీ దెబ్బతీయడం తన ఉద్దేశం కాదని సురేఖ పేర్కొన్నట్లు తెలిపారు. ఇరువైపులా కూడా మహిళలు ఉన్న విషయాన్ని సినీ ప్రముఖులు గుర్తించాలని కోరారు.మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పార్టీకి సంబంధించిన వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని.. ఓ సోదరికి ఓ సోదరుడిగా నూలుపోగు దండ వేసిన విధానాన్ని ట్రోల్ చేయడం జరిగిందన్నారు. దీన్ని సినిమావాళ్లు కూడా చూసి ఉండొచ్చు అన్నారు. దీంతో ఆ మహిళ ఎంత బాధపడ్డారో ఆలోచించండి... బేషరతుగా సురేఖ తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకున్నారు. ఇకపై కాంగ్రెస్ నేతలు, మంత్రులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

# మార్పు మార్పు అంటూ మోసం

- పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం
- అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం
- వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలన వైఫల్యానికి నిదర్శనం.. అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం.. అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి.. సీఎం రేవంత్ రెడ్డికి లేకపోవడంతో అసలు సమస్య ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఈ దుస్థితి ఉంటే.. వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప.. దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం.. మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ దుయ్యబట్టారు.

# పాల లాంటి మంజీరా నీళ్లల్లో విషపు చుక్కలు కలుపుతారా..?

- జేసీబీ, పోక్లెయిన్ వస్తే అడ్డం పడతాం.
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- న్యాల్కల్‌లో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు



**బలగం టీవి, హైదరాబాద్**

జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్కల్‌లో ఫార్మా సిటీ ఏర్పాటు చేసి పాలలాంటి మంజీరా నీళ్లల్లో విషపు చుక్కలు కలుపుతారా..? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. న్యాల్కల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ న్యాల్కల్‌లో ఫార్మా సిటీ పేరిట 2 వేల ఎకరాలు గుంజుకుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు అని హెచ్చరించారు. జేసీబీ, పోక్లెయిన్ వస్తే మీ ఎమ్మెల్యే, నేను అడ్డం పడతాం. మా మీద ఎక్కినంకనే మీ వద్దకు అవి రావాలి. మీ కోసం గ్రీన్ ట్రిబ్యునల్, హై కోర్టులో కేసు వేస్తాం. ఇక్కడి భూమిని పోనివ్వం. ఒక్క మాట మీద ఉండండి. ఎవడు వస్తాడో చూస్తా, ఎట్లా వస్తారో చూస్తా అని అన్నారు.

“కోహీర్ జామకాయలు, డపూరు పుదీనాకు ఫేమస్.. ఇలాంటి భూములను నాశనం చేసే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలి. ఇక్కడి భూముల్లో ఫార్మా చిచ్చు పెట్టకు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల భూములు లాక్కోవడమా..? ఫార్మా సిటీ పెట్టి మంజీరను నాశనం చేస్తావా..? ఫార్మా సిటీతో ఇక్కడి నాలుగు వాగులు, పెద్ద వాగు, చెరువులు, మంజీర కలుషితం అవుతాయి. మెదక్, హైదరాబాద్ ప్రజలకు కలుషిత నీరు అందిస్తారా?” అని రేవంత్‌ను హరీశ్‌రావు నిలదీశారు. “భూములు లాక్కోనేందుకు చీకట్లో సంతకాలు పెట్టిస్తారు. జాగ్రత్తగా ఉండండి.. మోస పోకండి. ఎవరు ఏడవకండి మీకోసం మేము కొట్లాడుతం. మీరు ఐక్యంగా ఉండండి, మీకు అండగా ఉంటాం. రాళ్లు, రప్పలు ఉన్న భూముల్లో ఫ్యాక్టరీలు పెట్టండి. ఇక్కడ కాదు. నేను, మాణిక్ రావు ఇక్కడే ఉంటాం.. ఇక్కడే పడుకుంటాం జేసీబీలకు అడ్డంగా ఉంటాం. డూప్లికేట్ ఇందిరమ్మ రాజ్యం ఇది. సీఎం కావాలని అన్ని పార్టీలు మారి కాంగ్రెస్‌లోకి జంప్ అయిండు. ఎవరన్నా వస్తే ఒక్క ఫోన్ చేయండి.. రెండు గంటల్లో వస్తాం. తాత తండ్రికి ఇచ్చిన భూమి మీరు మీ పిల్లలకు ఇవ్వాలి. రేవంత్ రెడ్డి గద్దలా తన్నుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం” అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

# అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు



**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ క్రికెట్ సంఘంతో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో.. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ, ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఆ సమయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ పనిచేశారు. క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఆర్ నమోదు చేసింది ఈడీ. ఈ విషయం ఇప్పటికే అజారుద్దీన్ బెయిల్ పొందారు. అయితే తాజాగా విచారణ చేపట్టాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. అజారుద్దీన్ గురువారం ఈడీ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీఏలో 20 కోట్ల మోసం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఈడీ విచారణ చేపడుతున్నది. ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌లను గత డిసెంబర్‌లో విచారించారు.

హెచ్‌సీఏ కేసులో మాజీ మంత్రి, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జీ వినోద్‌ను కూడా ఈడీ ప్రశ్నించింది. గత ఏడాది నవంబర్‌లో వినోద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ ఇండ్లల్లో ఈడీ సోదాలు కూడా చేపట్టింది. మనీల్యాండరింగ్ చట్టం కింద 9 ప్రదేశాల్లో తనిఖీలు జరిగాయి. ఏసీబీ నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ విచారణ మొదలుపెట్టింది. ఉప్పల్ స్టేడియం కోసం డీజీ సెట్లు, ఫైర్‌ఫైటింగ్ సిస్టమ్స్, కెనోపీల ఖరీదులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.గత ఏడాది అక్టోబర్‌లో అజారుద్దీన్‌పై నాలుగు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. సుమారు 3.85 కోట్ల నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసులు బుక్ చేశారు. చీటింగ్, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర కింద అజార్‌పై కేసులు పెట్టారు. హెచ్‌సీఏకు చెందిన నాలుగు కేసుల్లోనూ గతంలో సిటీ కోర్టు అజార్‌కు బెయిల్ మంజూరీ చేసింది. 2019లో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ ఎన్నికయ్యారు. ఆయన 2023 ఫిబ్రవరి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి ఈటల సవాల్



**బలగం టీవి, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. హైడ్రా, మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతల విషయమై గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ‘నీకు దమ్ముంటే .. నేను మీరు ఇద్దరం విత్‌ఔట్ సెక్యూరిటీ మూసీ పరివాహక ప్రాంతంలో కూలగొడుతున్న ఇళ్ల దగ్గరికి పోదామా..? ఒకరోజు,రెండు రోజుల డేట్ పెట్టండి. చైతన్యపురిలాంటి కాలనీలకు పోదాం.శభాష్ రేవంత్ రెడ్డి.. మీరు చేస్తున్నది మంచి పనే అని ఎవరైనా అంటే అంటే నేను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను. బహిరంగంగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తాను.

కంటోన్మెంట్ లో మీటింగ్ పెట్టి.. సన్నాసులు, పిచ్చికుక్కలు కరిచిపోతారు అని మాట్లాడుతున్నారు. బతకొచ్చిన వాడు అని మాట్లాడుతున్నారు. చదువుకుంటే సంస్కారం వచ్చేది, ఇతరులు చెప్పేది వింటే జ్ఞానం వస్తుండే. నేను చదువుకుంది కేశవ్ మెమోరియల్ స్కూల్. నా జూనియర్ కాలేజీ అలియా జూనియర్, గన్ఫౌండ్రి. డిగ్రీ కాలేజీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ. నా బిజినెస్ అంతా ఇక్కడే. నన్ను పట్టుకొని బతుకొచ్చినవాడు అంటున్నాడు. నీ పిచ్చి మాటలకు తెలంగాణ సమాజం సిగ్గు పడుతుంది. మల్కాజిగిరి ప్రజలు నిన్ను గెలిపిస్తే మొఖం చూడకుండా మోసం చేశావు. ఒక్కనాడన్నా నిలబడి పని చేయలేదు. మంత్రిగా పనిచేసి ఉంటే సిస్టమ్ తెలిసేది.

నేను కానీ మా పార్టీ గాని అభివృద్ధికి వ్యతిరేకం కాదు. మూసీ ప్రక్షాళనకు కూడా వ్యతిరేకం కాదు. పేదలకు ఇల్లు కట్టించడానికి, మూసి ప్రక్షాళనకు, చెరువులను కొబ్బరినీళ్ళ లెక్క చేస్తానన్నా వ్యతిరేకం కాదు. మేము అడిగేది.. ఆరు గ్యారెంటీలు, 66 హామీలు, 420 పనులు చేస్తామని చెప్పారు..రైతుల కోసం వరంగల్ లో రాహుల్ గాంధీ చేత, సోనియాగాంధీ చేత, ప్రియాంక గాంధీ చేత, ఖర్గేగారి చేత గ్యారెంటీల సభలు పెట్టారు. ఆరు గ్యారెంటీలలో ఒక్క పని కూడా చేయలేదు. మహిళాపాలసీలో ఆర్టీసీలో ఉచిత బస్సు తప్ప రూ. 2500 ఇవ్వలేదు. తులంబంగారం ఇవ్వలేదు. రూ. 20 లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు. రైతులారా వెంటనే రుణం తీసుకోమని చెప్పారు..కానీ, వారికి రుణమాఫీ చేయలేదు. రూ. 500 రూపాయల బోనస్, రూ. 3 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణం, రూ. 18 వేల రైతు భరోసా, కౌలురైతులకు డబ్బులు, రైతు కూలీలకు రూ. 12 వేల రూపాయలు ఏది కూడా ఇవ్వలేదు.

తేమ్స్, సబర్మతి, గంగాప్రక్షాళన అని మాట్లాడుతున్న మీరు.. రూ. 1,50,000 కోట్లు మూసీ నదికోసం కేటాయిస్తాం అని చెప్తున్నారు. తెలివి ఉందా లేదా ? సమాచారంతో మాట్లాడండి. సబర్మతి రివర్ ఫ్రంట్ కి రూ. 1400 కోట్లు ఖర్చు పెడుతున్నారు. 2511 కిలోమీటర్లు గంగా ప్రక్షాళన కోసం.. 50 కోట్ల జనాభాను తాకే ప్రాజెక్ట్ గంగానమామి కోసం రూ. 20 వేల కోట్లు ఖర్చు చేశారు. మరి మూసీ కోసం నువ్వు ఖర్చుపెట్టేది రూ. 1.5 లక్షల కోట్లా?

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు లేవు. దవాఖానాలలో మూడు నెలలుగా మందులు లేవు. మూడు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలలో పనిచేసిన వారికి బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు ఇవ్వకపోతే చచ్చిపోతామని వారంతా చెబుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు డబ్బులు రావడం లేదు. ఆర్టీసీకి ఇచ్చిన రూ. 280 కోట్ల చెక్కు బౌన్స్ అయింది. ఈ రాష్ట్రం అప్పుల ఊబీలోకూరకుపోయిందని, అసెంబ్లీ వేదికగా చెప్పారు. నెలకు రూ. 7 వేల కోట్ల డబ్బులు కట్టే పరిస్థితి వచ్చిందని మీరే చెప్పారు. తెచ్చుకున్న అప్పుకే వడ్డీలు కట్టే పరిస్థితి లేదు.. ఆర్థిక పరిస్థితి నాశనమైందని ఇవ్వాల నుకున్న కూడా ఇవ్వలేక పోతున్నా అని చెప్తున్న మీరు ఒక లక్ష 50 వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి తీసుకురాగలరు చెప్పగలరా ?

కేసీఆర్ నిజస్వరూపం తెలవడానికి ఆరు సంవత్సరాలు పడితే.. రేవంత్ రెడ్డి ఆరు నెలలకే బయటపడ్డారు” అని అన్నారు.

# మత్స్యకారులు లక్షాధికారులు కావాలి



● ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తెలంగాణ రాష్ట్రంలో మత్స్య రంగం మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులందరూ లక్షాధికారులుగా ఎదగాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టల రవీందర్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో "ప్రకృతి పర్యావరణ సంస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన మత్స్య సహకార సంఘాల అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశానికి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచందర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పిట్టల రవీందర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య రంగం అభివృద్ధి కోసం మరియు మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు తెలుపుతున్న పథకాలను సద్వినియోగపరచుకొని మత్స్యకారులందరూ హార్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయల భారీ నిధులతో దేశవ్యాప్తంగా అమలు జరుపుతున్న "ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం" లో భాగంగా ప్రాథమిక మత్స్య సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడం కోసం మరియు ఆ సంఘాలలో సభ్యులుగా కొనసాగుతున్న మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు అనేక పథకాలను అమలు జరుపుతున్నదని ఈ సందర్భంగా తెలియజేశారు.

"ప్రకృతి పర్యావరణ సంస్థ" లాంటి స్వచ్ఛంద సంఘాలు మత్స్యకారులను లక్షాధికారులను చేసే దిశలో కొనసాగిస్తున్న కృషి ప్రశంసనీయమైనదని అన్నారు.తెలంగాణలోని మత్స్యకారులు చేపల పెంపకం విషయంలోనూ, పంపిణీ విషయంలోనూ సాంప్రదాయ పద్ధతులకు బదులుగా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక విధానాలను అలవరచుకోవాలని, ముఖ్యంగా విలువల జోడింపు వ్యాల్యూ ఆడిషన్, చేపల శుద్ధి ఫిష్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేపల మరియు రొయ్యలకు సంబంధించిన పచ్చళ్ళ తయారీలో అవసరమైన శిక్షణను ఇప్పించేందుకు "ప్రకృతి పర్యావరణ సంస్థ" లాంటి స్వచ్ఛంద సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. తెలంగాణలో ఉత్పత్తి చేసే చేపలకు ఇతర రాష్ట్రాలతో సహా విదేశాలలోనూ మంచి గిరాకీ ఉన్నదని, ఈ అవకాశాలను గ్రామీణ స్థాయి సహకార సంఘాలు కూడా వినియోగించుకున్నప్పుడే మత్స్యకారులు లక్షాధికారులుగా ఎదగలుగుతారని పిట్టల రవీందర్ అభిప్రాయపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాంప్రదాయ నీటి వనరులతో పాటు మిడ్ మానేర్, అప్పర్ మానేరు, అనంతసాగర్ లాంటి అనేక నీటిపారుదల ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగ పరుచుకొని మత్స్యకారులు ఆర్థికంగా మెరుగుపడేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిట్టల రవీందర్ సూచించారు. ప్రకృతి పర్యావరణ సంస్థ అధ్యక్షులు పి.మాధవరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మత్స్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంప్రదాయ మత్స్యకారులు కూడా మార్పు చెందాలని తగనుగుణంగా తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించుకోవాలని సూచించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు గ్రామస్థాయి మత్స్య సహకార సంఘాలు ముందుకు రావాలని, సహకార సంఘాల సభ్యులను చైతన్యవంతం చేయడంలో ఆయా సంఘాల బాధ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచంద్ర మాట్లాడుతూ గతంలో కేవలం 92 మత్స్య సహకార సంఘాలు మాత్రమే ఉండేవని, గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఈ సంఖ్యను 150కి పెంచుకోగలిగినట్లు వివరించారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా నలుమూలల నుండి వచ్చిన మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా మత్స్య సహకార సంఘం వైస్ చైర్మన్ శేఖర్, డైరెక్టర్ పరశరాములు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని మండెపల్లి గ్రామంలో లబ్ధిదారులకు బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నక్క రవి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.నక్క భవ్యశ్రీకి 5,000,మేఘమాల11500, నక్క స్వరూప 14,500, జి పర్వరాం 9,000, బి ప్రవళిక 51000, కడారి భూమవ్వ 14,000,కె రమ్య 11,500,పెద్ది మంగ 7,000, గ్రామంలో 1,23,500 రూపాయల చెక్కులను ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మాజీ సర్పంచ్ గణప శివజ్యోతి, ఎంపిటిసి బుస్స స్వప్న లింగం, మాజీ ఉప సర్పంచ్ ధర్మారెడ్డి నాగరాజు, గుర్రం కిషన్ గౌడ్, మాజీ సర్పంచ్ తంగళ్ళపల్లి దేవయ్య,మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షులు ధర్మారెడ్డి హారిక,కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు ఆసాని మైపాల్ రెడ్డి, నక్క నరేష్, పన్యాల దుర్గారెడ్డి,ధర్మారెడ్డి చందు, నక్క కుమార్, బీఆర్ఎస్ నాయకులు బుస్స లింగం, రాగిపెల్లి కిష్టారెడ్డి,చేతుల మీదిగా లబ్ధిదారులకు అందజేశారు.లబ్ధిదారులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## మల్లికార్జున కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి గ్రామ శ్రీమల్లికార్జున కురుమ సంఘం అధ్యక్షునిగా ఎగుర్ల కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షుడిగా ఒగ్గు కుంటయ్య ప్రధాన కార్యదర్శిగా బోడపట్ల అంజయ్య,కోశాధికారిగా దయ్యాలరాములు,కార్యదర్శిగా కాకల మల్లేశం,ముఖ్య సలహాదారులుగా గుంటి రాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కురుమ సంఘం అధ్యక్షులు ఎగుర్ల కరుణాకర్ మాట్లాడుతూ తన ఏకగ్రీవానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సంఘ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బోణీ కొట్టిన బంగ్లాదేశ్



**బలగం టీవీ , దుబాయ్**

మహిళల టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ బోణీ కొట్టింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జా క్రికెట్ స్టేడియంలో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లు పెద్దగా రాణించకున్నా బౌలర్ల అద్భుత ప్రదర్శనతో 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. స్కాట్లాండ్ వికెట్ కీపర్ సరాహ్ బ్రైస్(49 నాటౌట్) కడదాకా పోరాడినా జట్టును గెలిపించలేకపోయింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌ను స్కాట్లాండ్ బౌలర్లు సస్కియా హార్లే(3/13), ఒలివియా బీల్(1/23)లు తక్కువకే కట్టడి చేశారు. శోభన మోస్త్రే(36), ఓపెనర్ శాతి రాణి(29)ల పోరాటంతో బంగ్లా 7 వికెట్ల నష్టానికి 109 రన్స్ కొట్టింది. అనంతరం స్వల్ప ఛేదనలో స్కాట్లాండ్ తడబడింది. ఓపెనర్ సస్కియా హార్లే(8)ను ఫహిమా ఖాతూన్ ఔట్ చేసి స్కాట్లాండ్‌ను దెబ్బకొట్టింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ క్యాథరిన్ బ్రిసే(11), ఐసా లీస్టర్(11)లు సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయారు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ సరాహ్ బ్రైస్(49 నాటౌట్) మాత్రం పట్టు వదల్లేదు జట్టును గెలిపించేందుకు చివరిదాకా పోరాడింది. కానీ, మరుఫా అక్తర్, రితు మోనిలు పరుగులు కట్టడి చేసి బంగ్లాను గెలుపు దిశగా నడిపించారు.

## పాక్ గెలుపు



**బలగం టీవీ , దుబాయ్**

మహిళల టీ20 వరల్డ్‌కప్-2024లో భాగంగా షార్జా వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్ 31 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. గ్రూప్-ఎలో భాగంగా గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. పాక్ తరపున కెప్టెన్ ఫాతిమా సనా (30, 20 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్) ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగగా.. నిద దార్ (23), ఒమైమా సోహైల్ (18) పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో చమరీ ఆటపట్టు, సుగంధిక కుమారి, ఉదేశిక ప్రబోధని చెరో 3 వికెట్లతో సత్తాచాటారు.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంకకు బ్యాటర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. పాక్ బౌలర్ల ధాటికి లంక 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 85 పరుగులే చేయగలిగింది. నిలాక్షిక సిల్వ (22), విష్మి గుణరత్నే (20) ఇద్దరే రెండంకెల్ల స్కోరును దాటగలిగారు. పాక్ బౌలర్లలో సాదియా ఇక్బాల్ 3 వికెట్లతో విజృంభించగా.. ఫాతిమా, ఒమైమా, నష్ర సంధూ తలో 2 వికెట్లు పడగొట్టి తమ జట్టుకు ప్రపంచకప్‌లో శుభారంభాన్ని అందించారు.



## సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉద్యమకారుల సంబరాలు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అప్పటి జిల్లా ఉద్యమ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉద్యమ జేఏసీ నాయకులు బుస్స వేణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన జిల్లాగా సిరిసిల్లను ఏర్పాటు చేయాలని ఎన్నో పోరాటాల ద్వారా జిల్లాను ఏర్పరచుకోవడం జరిగిందని అన్నారు. ఏడు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎనిమిదవ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరికి రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భవ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఆనాడు జిల్లా కోసం చేసి పోరాటాలలో అప్పటి జిల్లా జేఏసీ ఉద్యమ నాయకులపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో కేసులు పెట్టిందని, ఇప్పటికైనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా ఉద్యమకారులను గుర్తించి వెంటనే కేసులను ఎత్తివేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.జిల్లా ఏర్పాటు కోసం ఆనాడు తాము చేసిన ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకొని కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, సంగీతం శ్రీనివాస్, బైరనేని రాము, ఆకుల బాలరాజు, రాగుల రాములు, చొక్కాల రాము, దశరథం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వ్యాఖ్యలను ఖండించిన సినీ ప్రముఖులు







**నాగచైతన్య - సమంత విడాకుల విషయంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై పలువురు సినీ ప్రముఖులు స్పందించారు. మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

"గౌరవనీయులైన మహిళా మంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలు చూసి నేను చాలా బాధపడ్డాను. సెలబ్రిటీలపై వ్యాఖ్యలు చేసి తక్కువ సమయంలో వార్తల్లో నిలిచేందుకు, సినీ కుటుంబాలకు చెందిన వ్యక్తులను సాఫ్ట్? టార్గెట్? చేసుకోవడం సిగ్గుచేటు. మా సినీ కుటుంబసభ్యులపై ఇలాంటి దుర్మార్గపు మాటల దాడులను చిత్ర పరిశ్రమ మొత్తం ఏకతాటిపై వ్యతిరేకిస్తాం. ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు, ముఖ్యంగా మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. అసహ్యకరమైన కల్పిత ఆరోపణలు చేయడం రాజకీయంగా మంచిది కాదు. సమాజ అభివృద్ధి కోసం మేము మా నాయకులను ఎన్నుకుంటాం. కానీ ఇలాంటి వ్యాఖ్యలతో వారు తమ స్థాయిలను దిగజార్చుకోవద్దు. గౌరవ ప్రదమైన స్థానాల్లో ఉండేవారు, రాజకీయ నాయకులు ఎంతో మందికి స్ఫూర్తిగా ఉండాలి"

**–మెగాస్టార్ చిరంజీవి**

"వ్యక్తిగత విషయాలను రాజకీయంగా వాడుకోవడం చాలా బాధ కలిగించింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి రాజకీయ లబ్ధి కోసం వ్యక్తిగత విషయాన్ని ఆయుధంగా మార్చడం దురదృష్టకరం. మా సినిమా కుటుంబం మొత్తం పరస్పరం సహకరించుకుంటాం. సినిమా వాళ్ల వ్యక్తిగత జీవితాలను రాజకీయ రంగంలోకి లాగడం ఎవరికీ ఉపయోగం ఉండదు. ఉన్నతపదవుల్లో ఉన్నవాళ్లు, రాజకీయ నాయకులు ఇలాంటి మాటలు మాట్లాడేటప్పుడు ఆలోచించాలి."

**– హీరో వెంకటేశ్**

మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతో బాధ కలిగించాయి. ఒక కూతురికి తండ్రిగా, భార్యకు భర్తగా, ఓ తల్లికి కొడుకుగా... ఓ మహిళా మంత్రి మరో మహిళపై చేసిన వ్యాఖ్యలు, ఉపయోగించిన భాష ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఆమె భాషపట్ల తాను తీవ్ర మనోవేదనకు గురయ్యాను. ఎదుటివారి మనోభావాలను గాయపర్చనంత వరకు మనకు వాక్‌స్వాతంత్రం ఉంటుంది. ఇలాంటి చవకబారు, నిరాధారమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. సినిమా వారిని లక్ష్యంగా చేసుకోవద్దు మన దేశంలోని మహిళలను, సినిమా పరిశ్రమ వారిని గౌరవించాలి.

**– మహేశ్ బాబు**

"సినీ ప్రముఖులు, వారి కుటుంబాలపై చేసిన నిరాధారమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ ప్రవర్తన చాలా అగౌరవంగా, మన తెలుగు సంస్కృతి విలువలకు విరుద్ధంగా ఉంది. ఇలాంటి బాధ్యతారహితమైన చర్యలను సాధారణ మైనవిగా అంగీకరించకూడదు. ఇతరుల వ్యక్తిగత గోప్యత, మరీ ముఖ్యంగా మహిళలను గౌరవించేలా పార్టీలు బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. మనందరం కలిసి సమాజంలో గౌరవం, మర్యాద పెంపొందించాలి."

**– జూనియర్ ఎన్టీఆర్**

"కొండా సురేఖ గారూ, వ్యక్తిగత జీవితాలను బయటకులాగడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ. ప్రజా జీవితంలో ఉన్న మీలాంటి ముఖ్యమైన వ్యక్తులు హుందాగా, గౌరవంగా గోప్యతను పాటించేలా వ్యవహరించాలి. బాధ్యతారాహిత్యంగా చిత్రి పరిశ్రమపై నిరాధార ప్రకటనలు చేయడం నిజంగా బాధాకరం. ఇతరులు మాపై ఇలాంటి ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేదిలేదు. ఒకరినొకరు గౌరవించుకోవడం, పరిధులు దాటి ప్రవర్తించకుండా ఉండేందుకు ఈ అంశాన్ని కచ్చితంగా లేవనెత్తుతాం. ప్రజాస్వామ్య భారతదేశంలో నిర్లక్ష్య ప్రవర్తనను మన సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ హర్షించదు'

**– అల్లు అర్జున్**

"సమాజంలో ఇటీవల కాలంలో జరిగిన దురదృష్టకరమైన వ్యాఖ్యల కారణంగా సినిమా కుటుంబాలకు కలిగిన బాధను ప్రస్తావించడం చాలా అవసరం. మా పరిశ్రమ ఇతర రంగాల మాదిరిగానే పరస్పర గౌరవం, నమ్మకంతో నడుస్తోంది. ప్రజా లేదా రాజకీయ లాభాల కోసం అవాస్తవ కథనాలను వాడటం చాలా నిరాశ కలిగించింది. మేం నటులుగా ప్రజల దృష్టిలో ఎప్పుడూ ఉంటాం. కానీ మా కుటుంబాలు వ్యక్తిగతం. మిగిలిన అందరి కుటుంబాల్లాగే మాకు కూడా గౌరవం, రక్షణ అవసరం."

**– మంచు విష్ణు, మా అధ్యక్షుడు**

మంత్రి కొండా సురేఖ గారూ మీ నీచమైన, స్త్రీ ద్వేషపూరిత వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. సినీ ప్రముఖులను రాజకీయ పావులుగా వాడుకోవడం మీ నిరాశను తెలియజేస్తుంది. మీరు కేవలం మహిళలను మాత్రమే అవమానించడం కాదు.. తెలంగాణకు గర్వకారణమైన మొత్తం పరిశ్రమను అగౌరవపరిచారు. మీ కీర్తి ఇప్పటికే దెబ్బతిన్నది. దానిని మరింత దిగజార్చవద్దు.

**– సుధీర్‌బాబు**

రాజకీయ నాయకులు ఎలాంటి అవాకులు చెవాకులు మాట్లాడినా తప్పించుకోవచ్చని అనుకోవడం చూస్తే అసహ్యం వేస్తుంది. మీ మాటలు చాలా బాధ్యతారహితంగా ఉన్నప్పుడు.. మీకు మీ ప్రజల పట్ల ఏదైనా బాధ్యత ఉంటుందని ఆశించడం మా తెలివితక్కువ పని. ఇది కేవలం యాక్టర్లు, సినిమా గురించి కాదు. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదు. గౌరవప్రదమైన హోదాలో ఉన్న వ్యక్తి మీడియా ముందు ఇలా నిరాధారమైన కామెంట్స్ చేయడం సరైంది కాదు. మన సమాజాన్ని చెడుగా ప్రతిబింబించే ఇలాంటి ఆచారాన్ని మనందరం ఖండించాలి.

**– నాని**

"ఇప్పటికే ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న ఒక కుటుంబం గురించి ఇలాంటి అసహ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఎంతో తప్పు. ఒక స్త్రీ గురించి మరో స్త్రీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరం. నటీనటులు, వారి కుటుంబాలు ఎందుకని ఎల్లప్పుడూ సాఫ్ట్ టార్గెట్ అవుతారు? తమ అభిప్రాయాలు తెలియజేయడం కోసం కొంతమంది ఏదైనా మాట్లాడతారు. దయచేసి అసలైన ప్రజాప్రయోజనాలపై దృష్టిపెట్టండి" అని అన్నారు.

**–లావణ్య త్రిపాఠి..**

"ఇది చాలా నిరుత్సాహకరం. ప్రతిసారీ రాజకీయ నాయకులు సినీ పరిశ్రమకు చెందిన వారిపై ఇలాంటి నిందలు వేయడం కోపం తెప్పిస్తోంది. రాష్ట్రంలో ఏదైనా భయంకరమైన సంఘటన జరిగినప్పుడు రాజకీయ నాయకులు వారి అజెండాల కోసం సినీ ప్రముఖుల నుంచి మద్దతు కోరుతారు. ఇది ఎలా న్యాయం అవుతుంది? ఇప్పుడు మేం ఎందుకు మౌనంగా ఉండాలి? ఓ మహిళ నుంచి ఇలాంటి ఆరోపణలు మరింత ఎక్కువ బాధ కలిగిస్తున్నాయి. ప్రజలకు వినోదాన్ని అందించేందుకు తమ జీవితాలను అంకితం చేసే వారిని గౌరవించండి. అంతేగానీ, ఇలా రాజకీయాల్లోకి లాగొద్దు. ఇది చాలా అన్యాయం"

**– మంచు లక్ష్మి..**

"మంత్రి గారు మాట్లాడిన పరుషమైన, అనవసరమైన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడం, ముఖ్యంగా ఒక మహిళ గురించి చెడుగా మాట్లాడటం ఆమోదయోగ్యం కానిది. సినీ కుటుంబానికి చెందిన వ్యక్తిగా.. ఇలాంటి ప్రవర్తనను మేము సహించం. రాజకీయ ప్రేరేపణలకు సినీ ప్రముఖులను, వారి కుటుంబాలను సాఫ్ట్ టార్గెట్‌గా వాడుకోవడం ఇకనైనా మానేయాలి. అభివృద్ధిపై దృష్టిపెట్టండి. అంతేకానీ ఇలాంటి అర్థంలేని వాటిపై కాదు"

**– వరుణ్ తేజ్..**

మంత్ర కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దారుణం. నాగార్జున కుటుంబంపై మంత్రి వ్యాఖ్యలు బాధకరం. ఈ విషయాన్ని రేవంత్ సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టాలి. ఈ వ్యాఖ్యలపై సురేఖ వెంటనే క్షమాపణలు చెప్పాలి. దీనిని సినీ ఇండస్ట్రీ మొత్తం ఖండించాలి.

**–కోన వెంకట్**

సినీ పరిశ్రమ ఇలాంటి వేధింపులను సహించదు... మీరు ఓ మహిళగా ఉండి.. మరొక మహిళపై ఇలాంటి నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు చేసినందుకు మొత్తం సినీ పరిశ్రమకు క్షమాపణ చెప్పాలి. భారతదేశంలో ప్రజాస్వామ్యం అనేది వన్ వే ట్రాఫిక్ కాదు.. కానీ మేము మీ స్థాయికి దిగజారలేము.

**– ఖుష్బు సుందర్**

అక్కినేని నాగార్జున కుటుంబాన్ని అత్యంత భయంకరంగా అవమానపరిచిన కొండా సురేఖ కామెంట్స్‌కు నేను షాక్ అయిపోయా. తన రాజకీయ ప్రత్యర్థి మీద పగ తీర్చుకోవడానికి మధ్యలో నాగార్జున ఫ్యామిలీని రోడ్డు మీదకు లాగడం ఏ మాత్రం భరించకూడదు. కేటీఆర్‌ను దూషించే క్రమంలో అక్కినేని కుటుంబాన్ని అంత దారుణంగా అవమానించటంలో అర్థమేంటో కనీసం ఆవిడకైనా అర్థమయ్యుంటుందో..? లేదో..? నాకర్థమవ్వటం లేదు?. తనను రఘునందన్ ఇష్యూలో ఎవరో అవమానించారనీ అసలు ఆ విషయంతో ఏ మాత్రం సంబంధం లేని నాగార్జున, నాగ చైతన్యలని అంతకన్నా దారుణంగా అవమానించటమేంటి.. 4 గ్రేడ్ వెబ్‌సైట్లు కూడా ప్రచురించని జుగుప్సాకరమైన నిందలు తనేదో తన కండ్లతో చూసి తన చెవులతో విన్నట్లు నిర్ధారణకు వచ్చి మీడియా ముందు అరచి చెప్పటం దారుణం. ఒక మంత్రి హోదాలో ఉండి నాగార్జున, నాగ చైతన్యలాంటి గౌరప్రదమైన కుటుంబాన్ని, సమంత లాంటి ఇండస్ట్రీ గర్వించదగ్గ ఒక మహా నటి మీద అంత నీచమైన మాటలనంటాన్ని తీవ్రంగా ఖండించాలి. సీఎం రేవంత్ రెడ్డిగారు ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకుని.. ఇలాంటివి జరగకుండా ఒక స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వాలని ఇండస్ట్రీ తరఫునుంచి అడుగుతున్నాం

**– ఆర్జీవీ**

# క్రికెట్‌లో ఏఐ




## • సోషల్ మీడియా వేధింపుల నుంచి మహిళా క్రికెటర్లను రక్షించేందుకు ఐసీసీ నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2024కి ముందు జట్లు మరియు ఆటగాళ్లకు మరింత సానుకూలమైన మరియు సమగ్రమైన ఆన్‌లైన్ అనుభవాన్ని ప్రోత్సహించడానికి ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ సోషల్ మీడియా మోడరేషన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది సోషల్ మీడియాలో అభ్యంతరమైన, ద్వేషపూరితమైన కంటెంట్ నుంచి మహిళా క్రికెటర్లను రక్షించేందుకు సరికొత్త ఏఐ టూల్‌ను ప్రారంభించింది. సోషల్ మీడియాలో క్రికెటర్లకు అభ్యంతరకరమైన కంటెంట్ నుంచి రక్షణ కల్పించే లక్ష్యంతో ఈ ప్రోగ్రామ్‌ను గురువారం ప్రకటించింది.

ప్రస్తుతం 60 మంది మహిళా క్రికెటర్లు ఈ ప్రోగ్రామ్‌లో సైన్ అప్ చేసుకున్నారు. దీంతో వారి సోషల్ మీడియా ఖాతాల్లోకి ఎటువంటి ద్వేషపూరితమైన కంటెంట్ రాకుండా ఏఐ టూల్ అడ్డుకుంటుంది. ఐసీసీ టీ20 మహిళ టీ20 వరల్డ్ కప్‌నకు ముందు ఉమెన్స్ ప్లేయర్లకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించేందుకు ఐసీసీ ఈ చొరవ తీసుకుంది. ఈ సోషల్ మీడియా మోడరేషన్ ప్రోగ్రామ్ ఏఐ సాంకేతిక అధారంగా నడుస్తుంది. గోబబ్బుల్‌తో కలిసి ఈ టూల్‌ను ఐసీసీ తీసుకొచ్చింది.

ఐసీసీ అధికారిక ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఛానెల్ సహా ఆటగాళ్ల వ్యక్తిగత సోషల్ మీడియా అకౌంట్లలో వచ్చే కామెంట్లను పర్యవేక్షిస్తుంది. ప్లేయర్ల సోషల్ మీడియా ఖాతాల్లో అభ్యంతరకర, ద్వేషపూరిత కంటెంట్, వేధింపులకు సంబంధించిన కామెంట్లు ఉంటే వాటిని ఇన్‌యాక్టివ్ చేస్తుంది. కాగా, ఈ టూల్ పై ఐసీసీ డిజిటల్ హెడ్ ఫిన్ బ్రాడ్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ టూల్ ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే ప్లేయర్లకు సానుకూల వాతావరణాన్ని అందించేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు.

# పుకార్లను ప్రచారం చేయొద్దు

## • టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తాను మరో రెండు నెలల పాటు ఆటకుదూరం కానున్నట్లు తనపై వస్తున్న వార్తలపై టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి స్పందించాడు. నిరాధారమైన పుకార్లను ఎందుకు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు. 2023 వన్డే వరల్డ్ కప్ అనంతరం చీలమండల గాయంతో షమి జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. పెయిన్ కిల్లర్స్ వాడుతూ వన్డే ప్రపంచకప్ ఆడిన షమి తర్వాత శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అనంతరం ఎన్సీఏలో పునరాగమనం కోసం ప్రయత్నిస్తున్నాడు. దాదాపు పూర్తి ఫిట్‌నెస్ సాధించానని షమి ఇటీవల కూడా పేర్కొన్నాడు.

అయితే షమి మోకాలి వాపు వచ్చిందని, దాంతో కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు ఆటకు దూరం కానున్నాడని, ఆస్ట్రేలియా పర్యటనకు కూడా షమి అందుబాటులో ఉండడని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై మహ్మద్ షమి సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. "ఇలాంటి నిరాధారమైన పుకార్లు ఎందుకు చేస్తున్నారు? కోలుకోవడానికి కష్టపడి శ్రమిస్తున్నాను. నా స్థాయి వరకు ఉత్తమంగా ప్రయత్నిస్తున్నాను" బోర్డర్ గావస్కర్ ట్రోఫీ నుంచి తప్పుకుంటున్నట్లు బీసీసీఐగానీ, నేనుగానీ ఏం చెప్పలేదు. ఇలాంటి ఆధారాల్లేని వార్తలను ప్రజలు పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. దయచేసి ఇలాంటి పుకార్లను, ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేయకండి" అని షమి పోస్ట్ చేశాడు. నవంబర్ 22 నుంచి భారత్–ఆస్ట్రేలియా అయిదు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. పెర్త్ వేదికగా తొలి టెస్టు నవంబర్ 22–26 వరకు జరగనుంది. అలాగే అడిలైడ్ వేదికగా పింక్ బాల్ టెస్టు డిసెంబర్ 6–10 వరకు, బ్రిస్బేన్ వేదికగా డిసెంబర్ 14–18 వరకు మూడో టెస్టు, డిసెంబర్ 26–30 వరకు బాక్సింగ్ డే టెస్టు, సిడ్నీ వేదికగా జనవరి 3 నుంచి 7 వరకు ఆఖరి టెస్టు జరగనుంది.

# చీఫ్ మినిస్టర్ కప్-2024 ప్రారంభం

**2028లో ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లు పతకాలు సాధించాలి**
**మతాలకు అతీతంగా అందరూ కలిసేది క్రీడామైదానం ఒక్కటే.**
**సీఎం రేవంత్‌రెడ్డి**




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ వ్యాప్తంగా 12,600 గ్రామాల్లో నిర్వహిస్తోన్న చీఫ్ మినిస్టర్స్ కప్–2024 ను ఎల్బీ స్టేడియం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్రీడల మస్కట్, లోగో, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమ చివర్లో క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "యువత వ్యసనాల వైపు వెళ్లొద్దు. వ్యసనాలు జీవితంలో మిమ్మల్ని ఏ తీరానికి చేర్చలేవు. తల్లిదండ్రులకు దుఃఖం తప్ప. మీ కుటుంబానికి కష్టాలు తప్ప. అదే క్రీడల్లో రాణిస్తే మీ జీవితంలో గొప్ప వ్యక్తులుగా గుర్తింపు పొందడమే కాకుండా మీ కుటుంబానికి గౌరవం తెస్తారు. అంతే కాకుండా దేశ ప్రతిష్టను ప్రపంచంలోనే ఇనుమడించే క్రీడాకారులుగా రాణిస్తారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని యువతకు దిశానిర్దేశం చేశారు.

"క్రీడాకారులు కఠోరమైన శ్రమతో రాణించాలి. ఇటీవలి ఒలంపిక్స్‌లో పతకాలు సాధించలేకపోయాం. 2028లో భారతదేశం తరపున ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలని ప్రతిజ్ఞ తీసుకోండి. మిమ్మల్ని అన్ని విధాలుగా ప్రోత్సహించే బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది" అని క్రీడాకారుల హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రి గారు ప్రకటించారు.

??క్రీడాకారులను ప్రోత్సహించడానికి, క్రీడలను అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో తీసుకుంటున్న చర్యలను ఈ వేదికగా ముఖ్యమంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

బాక్సింగ్‌లో దేశానికి తలమానికంగా క్రీడాకారిని నిఖత్ జరీన్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించాం. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ఎలా ప్రోత్సహిందో చెప్పడానికి నిఖత్ ఒక నిదర్శనం.అండర్ 17 జాతీయ ఫుట్‌బాల్ టీమ్‌ను తెలంగాణ దత్తత తీసుకోవాలని నిర్ణయించాం. వారికి కావలసిన శిక్షణను హైదరాబాద్‌లో అందిస్తామని ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడితో మాట్లాడా.పట్టుదల, ప్రయత్నం ఉంటే విజయం సాధిస్తారు. అందుకు దక్షిణ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఉదాహరణ. 16 ఎకరాల్లో ఉన్న ఆ ఒక్క యూనివర్సిటీ ఒలంపిక్స్‌లో ఏకంగా 32 బంగారు పతకాలను సాధించింది.

క్రీడలను ప్రోత్సహించడానికి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ , యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ లను స్థాపించాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలి. గురుద్వార్, మందిరం, మసీదు, ఒక చర్చ్ వంటి ప్రార్థనా మందిరాలకు ఎవరికి వారు వెళ్తారు. కానీ మతాలకు అతీతంగా అందరూ కలిసేది క్రీడామైదానం ఒక్కటే.ఎల్బీ స్టేడియం అద్భుతమైన స్టేడియంగా తీర్చిదిద్ది నగర క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి గారు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి గారు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ గారితో పాటు త్రివిధ దళాలకు చెందిన ప్రతినిధులు, క్రీడాకారులు పెద్దఎత్తున హాజరయ్యారు.




# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

(మొదటి పేజీ తరువాయి)

'దాదాపు 1250 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశాం. పోలీసు సిబ్బంది దాదాపు 3900 ఉన్నారు. గరుడ సేవకు ప్రత్యేకంగా 1200 మంది పోలీసులతో అదనపు భద్రత ఏర్పాటు చేయబోతున్నాం. ఆలయ మాఢ వీధులు, ఇతర ప్రాంతాల్లో 2,775 సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పర్యవేక్షిస్తాం. పిఏసి 4లోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో.. వీడియోవాల్ ద్వారా పలు ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షిస్తాం' అని టీటీడీ ఈవో వెల్లడించారు.

'లక్షలాది భక్తులు వాహనసేవలు వీక్షించేందుకు ఆలయ నాలుగు మాఢ వీధుల్లో గ్యాలరీలు సుందరంగా తీర్చిదిద్దాం. తిరుమలలో ఎల్ఈడి స్క్రీన్లు గత సంవత్స రం 3 రోజుల పాటు 28 స్క్రీన్లు ఏర్పాటు చేయగా.. 2024లో 9 రోజుల పాటు 28 స్క్రీన్లు ఏర్పాటు చేశాం. గరుడసేవ నాడు వాహనసేవను తిలకించేందుకు మాఢ వీధులు, భక్తుల రద్దీ ఉన్న మ్యూజియం, వరాహస్వామి విశ్రాంతి గృహం, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా విశ్రాంతి గృహం, ఫిల్టర్ హౌస్ ఇతర ప్రాంతాల్లో కలిపి 28 పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నాం' అని వివరించారు.

'శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన వసతి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకున్నాం. తిరుమలలో సామాన్య భక్తుల కోసం 6,282 గదులు అందుబాటులో ఉన్నాయి. సాధారణ రోజుల్లో 1,580 గదులు ఆన్‌లైన్‌లో భక్తులకు కేటాయిస్తారు. బ్రహ్మోత్సవాల్లో వీటిని 50 శాతానికి తగ్గించాం. వీఐపీ ఏరియాలో 1,353 గదులు అందుబాటులో ఉన్నాయి. తిరుమలలోని గదుల్లో దాదాపు 40 వేల మంది భక్తులు బస చేసే అవకాశముంది' అని టీటీడీ ఈవో అంచనా వేశారు.

పిఏసి 1, 2, 3, 4లలో కలిపి 28 హాళ్లలో.. దాదాపు 6700 లాకర్లు ఉన్నాయి. దాదాపు 20 వేల మంది భక్తులు బస చేయ వచ్చు. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమలలో వసతి పొందలేని భక్తులు తిరుపతిలో వసతి పొందాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. బ్రహ్మోత్స వాల రోజుల్లో స్వయంగా వచ్చే కాటేజి దాతలకు మాత్రమే గదులు కేటాయించడం జరుగుతుంది. అక్టోబరు 8న గరుడసేవ సందర్భంగా.. అక్టోబరు 7, 8వ తేదీలలో కాటేజి దాతలకు కూడా ఎలాంటి గదుల కేటాయింపు ఉండదు. అక్టోబరు 3 నుండి 12వ తేదీ వరకు ఎలాంటి సిఫార్సు లేఖలపై గదులు కేటాయించబోం. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని మనవి చేస్తున్నాం' అని టీటీడీ ఈవో స్పష్టం చేశారు.

'గరుడసేవ రోజున 24 గంటల పాటు ఘాట్ రోడ్లను తెరిచి ఉంచుతాం. బ్రహ్మో త్సవాల రోజుల్లో రోజుకు దాదాపు 2 వేల ట్రిప్పుల ద్వారా దాదాపు 2 లక్షల మందికి రవాణా సౌకర్యం కల్పిస్తాం. తిరుమలలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను చేరవేసేందుకు.. 24 గంటల పాటు ఉచిత బస్సులను ఏర్పాటు చేశాం. ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకున్నాం. సాధారణ రోజుల్లో 8 ప్రాంతాల్లో, గరుడ సేవ నాడు 12 ప్రాంతాలలో క్రేన్లు, ఆటోమొబైల్ క్లినిక్ వాహనాలు ఏర్పాటు చేస్తాం' ఈవో వివరించారు

# అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

(మొదటి పేజీ తరువాయి)

పైలట్ ప్రాజెక్టులో వచ్చే సమస్యల ఆధారంగా ముందుకెళతామని ముఖ్యమంత్రి వివరించారు. కుటుంబంలో సభ్యులు పెరిగినందున ప్రజలంతా కుటుంబ డిజిటల్ కార్డు కోసం వివరాలను నమోదు చేయించుకోవాలి. ఇందులో అవసరమైన మార్పుచేర్పులు ఎప్పుడైనా చేసుకోవచ్చు అన్నారు. ఒక్క క్లిక్ తో కుటుంబ సమగ్ర సమాచారం ఉండాలన్న ఆలోచనతో ఈ విధానం తీసుకొచ్చామని తెలిపారు. ఒకసారి కార్డు పొందిన తర్వాత రేషన్ తో పాటు ఇతర ప్రభుత్వ సౌకర్యాలను ఎక్కడి నుంచైనా పొందడానికి వీలుంటుందన్నారు. మహిళలే కుటుంబ పెద్దగా డిజిటల్ కార్డు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పులు, తప్పులు చేసిందని విమర్శించారు. ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు తెచ్చిందే తాను అని చెప్పారు. అధికారం కోల్పోవడంతో విచక్షణ కోల్పోయి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారన్నారు. అలాగే హైదరాబాద్? ట్రాఫిక్, వరదల సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఖాతాల్లో రూ.1,500 కోట్లు ఉన్నాయని, వాటిలో రూ.500 కోట్లు మూసీ పరిధిలోని పేదలకు పంపిణీ చేయాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ , ఎమ్మెల్యే శ్రీగణేశ్ , మేయర్ గద్వాల విజయలక్ష్మి , ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

# రైతులకు గుడ్ న్యూస్...

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. తాలు ,తరుగు, తేమ పేరు తో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం చెప్పారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని కోరారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే సంఖ్యలో గోనె సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంట వెంటనే తరలించేందుకు తగిన రవాణా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రతి రోజు కలెక్టర్లు తమ జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజు ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సీఎం సూచించారు.ఈసారి దిగుబడి అయ్యే 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనుగోలు చేసే ధాన్యం, రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కనపెడితే.. 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అందులో 44 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉంటాయని చెప్పారు.

**డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన**

అన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను 5వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మొత్తం 11062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సీఎంకు వివరించారు.

# స్టాక్ మార్కెట్లు ఢమాల్

(మొదటి పేజీ తరువాయి)

ట్రేడింగ్‌లో దాదాపు 1,077 షేర్లు పురోగమించగా.. 2740 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో బీపీసీఎల్, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ ఉన్నాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ లాభపడ్డాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. రియాల్టీ 4.5 శాతం, ఆటో, బ్యాంక్, మీడియా, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్ ఇండెక్స్ 2నుంచి 3శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 2శాతం చొప్పున పతనమయ్యాయి.

# కేసీఆర్‌ను కేటీఆర్ ఏదో చేశారు

(మొదటి పేజీ తరువాయి)



తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. గజ్వేల్‌లో పోటీ చేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఓటర్లు చెప్పుకుంటున్నారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్‌కు మతిభ్రమించింది. ఏదేదో మాట్లాడుతున్నాడు. హైడ్రా, మూసీ అంటూ ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నాడు. మూసీ ప్రక్షాళనకు తెరలేపింది బీఆర్ఎస్ పార్టీనే. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలని హెచ్చరిస్తున్నాను.ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపితే ఉపేక్షించేది లేదు. రేవంత్ నాయకత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది. అలాగే, పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. బీజేపీతో కలిసి బీఆర్ఎస్ నేతలు పనిచేశారు' అంటూ సంచలన ఆరోపణలు చేశారు.